


# అనుబంధాలు

ఇటి. రామారావు

ఆదర్శాల ముసుగులో ఆత్మవంచనకు పాల్పడే మనుషులంటే నాకు చాలా అసహ్యం. రవి మీద నాకు అయిష్టత పెరగడానికి కారణం కూడా ఇదే.

రవి నా తోడబుట్టిన తమ్ముడు. అమ్మా, నాన్నా ఇద్దరూ యాక్సిడెంట్‌లో ఒక్కసారిగా చనిపోయినప్పుడు రవి, నేను ఒకరికొకరు మిగిలాం ఈ లోకంలో! అప్పుడు రవికి పన్నెండేళ్ళు. నేను ఇంటర్మీడియట్ ఫైనలియర్లో ఉన్నాను. అయిన వాళ్ళంతా మాకు దూరమై చాలా సంవత్స రా లయింది. పెద్దలను కాదని ప్రేమను నమ్ముకుని అమ్మా, నాన్నా కులాంతర వివాహం చేసుకోవడమే దానికి కారణం! ఆ పరిస్థితులలో నాన్నగారి స్నేహితులే మాకు అండగా నిలిచారు. వాళ్ళ ప్రయత్నాల ఫలితంగానే నాన్నగారి ఆఫీసులో నాకు క్లర్కు పోస్టు లభించింది. నాన్నగారి గ్రాట్యుటీ, ప్రావిడెంట్ ఫండు అంతా కలిపి బ్యాంకులో వేసి కుటుంబ భారాన్ని స్వీకరించాను.

అప్పుడు నా వయసు పద్దెనిమిది. అమ్మా, నాన్నా బ్రతికి ఉంటే నా పెళ్ళి ప్రయత్నాలు జరుగుతూ ఉండేవి. అలాంటి వయసులో జీవితాన్ని ఒక ఛాలెంజిగా స్వీకరించి ముందడుగు వేయవలసిన పరిస్థితులు నావి. అప్పటి నా ధ్యేయం, ఆశ ఒక్కటే. రవిని బాగా చదివించాలి. మంచి ఉద్యోగస్తుడిని చేయాలి. అంతవరకు నా పెళ్ళి మాట తలపెట్టకూడదు. ఆ ఆలోచనే మనసులోకి రానిచ్చేదాన్ని కాదు.

నేనే వాడికి తల్లినై, తల్లి లేని లోటు తెలియనంత గారాబంగా పెంచాను రవిని. మితిమీరిన గారాబం మనిషిని చెడగొడుతుందనే సత్యం నాకు తెలియనిది కాదు. అయితే "అమ్మే గనుక బ్రతికి ఉంటే-" అనే ఆలోచన కూడా వాడి మనసులోకి రాకూడ దనేది నా అభిమతం.

అసహ్యకరమైన గొంగళి పురుగు దశలవారీగా పరిణామం చెంది అందమైన సీతాకోకచిలుకగా రూపు దిద్దుకుంటుంది. అయితే ఇందుకు విరుద్ధంగా మనిషి అందమైన బాల్యం నుండి స్వార్థం, క్రౌర్యం, కుటిలత్వం, రాగద్వేషాలు మూర్తీభవించిన ప్రవృత్తిని తనలో రోజు రోజుకీ పెంపొందించుకుంటూ పెరిగి పెద్దవా డవుతాడు. ఈ ప్రవృత్తి ప్రభావం రవి మీద కూడా ఉంది. అయితే వాడి మీద నేను పెంచుకున్న అభిమానం ముందు ఈ విషయం చాలా చిన్నదిగా అనిపించింది నా మనసుకి.

రవి బి.ఎస్సీ. ఫైనలియర్‌కి వచ్చాడు. పోలీస్ డిపార్టుమెంటులో ఎస్.ఐ. పోస్టులకి ప్రకటన పడగా, రవిని అప్లై చేయమని చెప్పాను. ఆ ప్రొఫెషన్ మీద వాడి కంత ఇష్టం లేకున్నా, నా బలవంతం మీద అప్లై చేశాడు. నా తమ్ముడు ఒక నిజాయితీ అయిన పోలీస్ అధికారిగా, చట్టానికి పరిరక్షకుడిగా రూపు దిద్దుకోవాలనీ, పోలీస్ వ్యవస్థ అంటే ప్రజలలో ప్రబలిపోయిన దురభిప్రాయాన్ని రూపుమాపే ప్రయత్నం చేయాలనీ ఆశించి వాడిచేత ఆ పోస్టుకి అప్లై చేయించాను.

నా నిర్ణయం వెనుక నాకు తెలీకుండానే కొంత స్వార్థం చోటు చేసుకుందేమో నాకు తెలీదు. వాడు త్వరగా ఉద్యోగస్తుడై బాధ్యతలను స్వీకరిస్తే నా గురించి ఆలోచిస్తాడనీ, ఇంతకాలం తన కోసం శ్రమిస్తూ వివాహాన్ని కూడా వాయిదా వేసుకుంటూ వచ్చిన అక్క గురించి కొంతైనా ఆలోచించకపోతా డా అనే చిన్న ఆశ నాలో ఏమూలో ఉండేదనుకుంటాను.

బి.ఎస్సీ. ఫస్ట్ క్లాసులో పాసైయాడు రవి. అప్లై చేసిన ఎస్.ఐ. పోస్టుకి ఇంటర్వ్యూ పిలుపు వచ్చింది. ఒక నెల పూర్తి కాకుండానే రిజల్ట్స్ కూడా తెలిశాయి. రవి సెలెక్టయ్యాడు. ట్రైనింగ్‌కు రమ్మని ఆర్డర్సు వచ్చాయి. ఆ వార్త వాడిలో ఎక్కువ సంతోషాన్ని కలిగించినట్లు లేదు. అంత ఉత్సాహంగా అగుపించలేదు.

"నా కెందుకో ఈ జాబ్ పట్ల ఆసక్తి లే దక్కా! ఖాకీ గుడ్డలు, గూండాలతో, హంతకులతో ప్రతి రోజూ వ్యవహారాలు ఇవన్నీ నా మనసుకి సరిపో డేటట్లు లేవు" నెమ్మదిగా అన్నాడు రవి నాతో ఆ రోజు.

ఒక్క క్షణం నిర్ఘాంతపోయాను. "మరి ఏం చెయ్యాలని నీ ఉద్దేశం?" తేరుకుంటూ అడిగాను.

"మెడిసిన్ చదవాలని ఉందక్కా. ఎంతో పవిత్రమైన ఆ వృత్తిలో మానవ సేవ చేసే అవకాశం ఎంతైనా ఉంది. పేద ప్రజలకు ఉచిత వైద్యం చేస్తూ ఎంతో కీర్తిని, మనశ్శాంతిని పొందవచ్చు" అన్నాడు మెల్లగా.

వాడి మాటల్లో నిజం ఉందనిపించింది. వాడికి ఇష్టం లేని, ప్రవృత్తికి సరిపడని ఉద్యోగంలో బలవంతాన చేర్పించడం కంటే, ఆలోచనలకు, అభిరుచికి సరిపడే వైద్య విద్య చదివే అవకాశం కల్పించడమే మంచి దనిపించింది. పైగా మానవ సేవ, ఉచిత వైద్యం- వాడు వెలిబుచ్చిన అభిప్రాయాలు నాకెంతో ఆనందానన్ని కలిగించాయి. నా పెంపకం వీడిలో మంచి ఆశయాలను రేకెత్తించిందనే సంతృప్తితో మనసు నిండిపోయింది.

మెడిసిన్ ఎంట్రన్స్ ఎగ్జామ్స్ వ్రాశాడు రవి. మంచి ర్యాంకు లభించకపోవడంతో ప్రైవేటు కాలేజీలో సీటు దొరికింది. డొనేషన్లకి, ఫీజులకి, పుస్తకాలకి బాంకులో డబ్బు జోలికి వెళ్ళక తప్పలేదు. అప్పట్లో రామనాథం గారు చెప్పిన మాటలు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి. ఆయన నేను పని చేసే ఆఫీసులో సీనియర్ గుమాస్తా. నాన్న గారికి కొలీగ్ కూడా.

"చూడమ్మా! ఇలా చెబుతున్నానని మరోలా భావించవద్దు. తమ్ముడిని మెడిసిన్ చదివించాలనే ఆలోచన మంచిదే కాని, నీ భవిష్యత్తుని గురించి ఆలోచించు కోమ్మా. నీ కప్పుడే పాతిక ఏళ్ళు. ఇంకా ఏళ్ళు గడిస్తే సంబంధాలు దొరకడమే కష్టం. ఉన్న కొంచెం డబ్బుని కూడా తమ్ముడి కోసం ఖర్చు చేస్తే రేపు నీ కేదైనా సంబంధం కుదిరితే డబ్బు అవసరపడితే ఏం చేస్తావు చెప్పు!"

ఆయన అభిమానంతో చెప్పిన మాటలకు నా మనసు ద్రవించింది. ఆయన మాటల్లోని నిజం నా

మనసు గ్రహించగలిగింది.

"నే నింతకాలం శ్రమించింది, పెళ్ళి మాట తలపెట్టకుండా గడిపింది వాడి భవిష్యత్తును గురించే బాబాయ్! నా గురించి నే నెప్పుడూ ఆలోచించలేదు. నా స్వార్థం కోసం, భవిష్యత్తు కోసం వాడి కొచ్చిన అవకాశాన్ని అడ్డుకోలేను. మీ మాటల్లో వాస్తవాన్ని నేను గ్రహించలేక కాదు. అయినా నా మనసు వాడి పురోభివృద్ధి గురించే ఆరాటపడుతున్నది. వాడు డాక్టరై, సంపాదనపరుడై ఈ అక్కను గురించి ఆలోచించకపోడని నా నమ్మకం బాబాయ్!" అన్నాను జీరపోయిన కంఠంతో.

ఆయనేం మాట్లాడలేదు. ఆయన చూపుల్లో జాలి మాత్రం నన్ను చాలాకాలం వెంటాడుతూనే ఉంది.

రవిని మెడిసిన్ చదివించడం నా ఆర్థిక స్థితికి ఏమాత్రం అందని పని అనిపిస్తున్నా చాలా కష్టాలు పడి వాడి చదువుకు ఏమాత్రం ఆటంకం కలుగకుండా చూస్తున్నాను. బాంకులో ఉన్న డబ్బు దాదాపుగా ఖర్చయిపోయింది. ఆఫీసులో అవకాశం ఉన్న చోటల్లా లోన్లు తీశాను. రవిని డాక్టరుగా చూడడం కోసం. డాక్టరై వాడు తన ఆశయాలను అమలు పరుస్తుంటే చూసి సంతృప్తి పడాలన్న తపనకొద్దీ నా శ్రమను మర్చిపోయి జీవిస్తున్నాను. రవి హౌస్ సర్జన్ చేస్తున్నాడు.

ఒక రోజు ఒక యువతిని వెంటబెట్టుకొచ్చాడు ఇంటికి.

"అక్కా! ఈవిడ శమంత! నా క్లాస్‌మేట్. లక్షాధికారి గోవిందరావు గారి కుమార్తె" అంటూ పరిచయం చేశాడు.

శమంత చాలా అందంగా ఉంది. మంచి మాటకారి. ఎలాంటి అరమరికలు లేకుండా ఎంతో చనువుగా, కలుపుగోలుగా మాట్లాడింది. నా కెందుకో బాగా నచ్చింది. ఆ అమ్మాయి రవికి భార్య అయితే బాగుండును అని అనుకోకుండా ఉండలేకపోయాను. ఆ తర్వాత చాలాసార్లు వచ్చింది ఇంటికి. వాళ్ళ మాటలు, చదువు చూసి ఇద్దరూ ప్రేమించుకుంటున్నారని నిర్ధారించుకున్నాను.

ఆ తర్వాత ఏమయిందో కాని శమంత మా ఇంటికి రావడం మానేసింది. రవితో కూడా కలిసి తిరగడం లేదు. ఒకసారి అడిగాను వాడిని. ముభావంగా తప్పించుకో చూశాడు కాని నేను బలవంతం చేయడంతో నోరు విప్పాడు.

"అలాంటి సంస్కారం లేని మనిషితో నేను స్నేహం చేయడమే పెద్ద పొరపా టక్కా! చాలా సంకుచిత మనస్తత్వాలు ఆ తండ్రీ కూతుళ్ళవి. నీ కింత వరకు పెళ్ళి కాలేదని, దానికి రకరకాల కారణాలు ఊహించి సహించరానంతగా మాట్లాడారు. నాకు కోపం వచ్చి వాళ్ళతో సంబంధం తెగతెంపులు చేసుకున్నాను" అన్నాడు.

అంత మంచి అమ్మాయితో రవి స్నేహం చెడగొట్టుకున్నాడని బాధ పడ్డా, వాడికి నా మీద గల అభిమానం, ప్రేమ తలచుకుంటే నా గుండె ఆనందంతో నిండింది.

ఒకరోజు ఆఫీస్ కొలీగ్స్‌తో ఎగ్జిబిషన్‌కి వెళ్ళగా అక్కడ ఎదురుపడింది శమంత. నన్ను చూసి ముఖం తిప్పుకొని వెళ్ళబోయింది కాని నేనే పలుకరించాను.

"ఏమ్మా! ఇంటికి రావడమే మానేశావు?" మామూలుగా ప్రశ్నించాను.

"ఎందుకు లెండి మీ ఇంటికి రావడం, మీ మనస్సుకి బాధ కలిగించడం" అన్నది నిష్ఠురంగా. ఆశ్చర్యపోవడం నా వనైంది.

"నా మనసుకి బాధా?" అర్థం కాక అడిగాను.

"కులం తక్కువ వాళ్ళమని, స్నేహం ప్రేమలాంటివి మానుకోమని మీ తమ్ముడికి సలహా ఇచ్చారట గదా? నాతో పెళ్ళి మాట తలపెడితే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించారట గదా! చదువుకొని ఉద్యోగం చేస్తున్నారు. కుల మతాల పట్ల మీకింత వివక్ష ఎందుకండీ?" ఆవేశంగా మాట్లాడింది శమంత.

నాకేమీ బోధ పడడం లేదు. ఎక్కడో ఏదో మెలిక ఉందని మాత్రం అర్థమైపోయింది.

ఆ మెలికకి అర్థం, రహస్యం ఒక వారం తర్వాత తెలిసింది. ఆఫీసుకి ప్రయాణ మవుతుండగా వాకిట్లో కారు వచ్చి ఆగింది. అందులో నుంచి దిగుతున్నది పరమేశ్వరం గారని గుర్తించడం నాకు కష్టం కాలేదు. కోటీశ్వరుడిగా, గొప్ప కాంట్రాక్టరుగా, థియేటర్ల యజమానిగా, సంఘసేవకుడిగా ఆయన ఫోటో చాలాసార్లు పేపర్లో చూశాను.

"చిన్నదానివి కాబట్టి నమస్కారం చెయ్యలేకపోతున్నాను" అంటూ చనువుగా వచ్చి కూర్చున్నాడు. కాసేపటికి అసలు విషయంలోకి వచ్చాడు. ఆయన ఏకైక కుమార్తె నందిత, రవి ప్రేమించుకున్నారట. హౌస్ సర్జన్ కాగానే పెళ్ళి జరిపించి ఇద్దరినీ విదేశాలకు పంపిస్తారట.

ఆశ్చర్యపోయాను.

"రవి మీ నందితను ప్రేమించాడా?" నమ్మలేనట్లుగా అడిగాను.

"అవు నయ్యాయ్! మీ దగ్గరకు వచ్చి మాట్లాడమని అతనే తొందరపెట్టాడు. వచ్చే నెలలో ముహూర్తాలు పెట్టిస్తాను. పెద్ద దిక్కు లేని వాళ్ళు మీరు. అన్నీ నేనే జరిపిస్తాను. అధైర్యపడకు" అంటూ సెలవు తీసుకున్నాడు.

రవి అసలు స్వరూపం మెల్లగా అర్థం కాసాగింది నాకు.

శమంతకంటే ధనవంతురాలు నందిత! పైగా విదేశాలకు పంపే ఏర్పాట్లు చేయగల స్తోమత కూడా ఉంది నందిత తండ్రికి. అందుకే శమంతతో ప్రేమను మరచిపోయి నందిత వైపు మళ్ళాడు. ఈ ఆటలో న న్నొక పావుగా వాడుకున్నాడు.

ఎంత నయవంచన! ఎంత స్వార్థం! నాకు తోడబుట్టిన తమ్ముడా వీడు?

రవి మీద మొట్టమొదటిసారిగా అసహ్యం కలిగింది.

వీడిని ఇంత కష్టపడి చదివించింది విదేశాలలో వెళ్ళి స్థిరపడడానికా? మానవ సేవ అనీ, ఉచిత వైద్యం అనీ ఆనాడు ఎన్నో కబుర్లు చెపిన వీడు చివరకు చేస్తున్నది ఇదా? ఆవేదనతో నా మనసు నిండిపోయింది.

తన భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటున్నాడే తప్ప తనకు బ్రతుకు నిచ్చిన అక్క విషయం గురించి ఏమాత్రమైనా ఆలోచిస్తున్నాడా? ఇన్నేళ్ళొచ్చినా అక్క పెళ్ళి పెటాకులూ లేకుండా ఏకాకిగా మిగిలిపోయిందనీ, ఆమె కో దారి చూపించాలనీ వీడికి అనిపించడం లేదా? అనుబంధాలకి అర్థమే లేదా? ఆర్థిక విలువలే మనిషికి ప్రధానమా? నా మనసు మూగగా ఆక్రోశిస్తున్నది.

ఆ రాత్రి రవితో చాలాసేపు గొడవ పడ్డాను. ఎన్నడూ లేనిది వాడిమీద కోపం చూపించాను. ప్రాధేయపడ్డాను.

"రవీ! నువ్వు కూడా నన్ను ఒంటరిదాన్ని చేసి వెళ్ళిపోతే నే నెందుకు బ్రతకాలి? ఎవరి కోసం బ్రతకాలి? పవిత్రమైన వైద్య వృత్తి నీ చేతుల్లో ఉంది. దానికి సార్థకత, సాఫల్యం చేకూరుస్తూ ఇక్కడే ఉండిపోరాదూ?" అంటూ అర్థించాను.

దానికి వాడి సమాధానం పట్ల నాలో పేరుకొంటున్న అసహ్యాన్ని రెట్టింపు చేసింది.

"వచ్చిన అవకాశాలని చేయి జార్చుకోవడం మూర్ఖత్వం అక్కా! ఇక్కడే ఉంటే నెలకు రెండు మూడు వేల జీతంతో సామాన్యమైన బ్రతుకు గడపాలి. అది నాకు ఇష్టం లేదు. నా బ్రతుకు నన్ను బ్రతకనీ! ఇక నీ సంగతి అంటావా? నా కోసం నువ్వు ఖర్చు పెట్టిన దానికి ప్రతిఫలంగా నెల నెలా నీకు కొంత డబ్బు వంపిస్తాను. సర్దుకో!" నింపాదిగా అన్నాడు.

"ఛీ!" అనుకున్నాను.

ఆ తర్వాత సంఘటనలన్నీ నా ప్రయత్నం లేకుండానే యధాలాపంగా జరిగిపోయాయి. రవి పెళ్ళికి ఒక అతిథిలాగా నేనూ వెళ్ళాను. అంతే! అసలు పెళ్ళికే వెళ్ళకూడ దనుకున్నాను గాని నలుగురూ ఏమైనా అనుకుంటారనే భయంతో ఆ పని చేయలేకపోయాను.

ఉదయాన్నే రవి తన భార్యతో కలిసి నా దగ్గరకి వచ్చాడు. "రేపే మా విదేశీ ప్రయాణం అక్కా! ఎనిమిదింటికి ఫ్లైట్! ఎయిర్‌పోర్ట్‌కి రావాలి?" అన్నాడు.

ముభావంగా తలూపాను.

మరునటి రోజు ఎంత వద్దనుకున్నా మనసు నిగ్రహించుకోలేకపోయాను. హడావిడిగా ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళాను. చాలామంది ఉన్నారు అక్కడ వాళ్ళకి వీడ్కోలు చెబుతూ!

నన్ను చూసిన రవి కళ్ళలో ఒక్క క్షణం ఆనందం మెరిసింది.

"వస్తా నక్కా! లెటర్స్ రాస్తూ ఉండు" అంటూ విమానం వైపు బయలుదేరాడు.

విమానం గాలిలోకి ఎగిరింది. నీళ్ళు నిండిన కళ్ళతో విమానం కనిపించినంత వరకు ఆకాశం వైపే చూస్తూ నిలుచున్నాను.

ఇది నా కథ!

కాదు... కాదు... ఒక అక్కయ్య మనోవ్యథ!

అనుబంధాల కోసం ఆరాటపడిన ఒక అక్కయ్య ఆవేదన! ★